క్లుప్తంగా

120 మందికి వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు సంతోష్

విజయనగరం ఫోర్ట్: నగరంలోని పీజీ స్టార్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత ఎముకల వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 120 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ముఖ్యంగా మోకాళ్ల అరుగుదల, కండరాలు బిగిసిపోవడం, రుమటాయిడ్, ఆర్థరైటిస్, లంబర్స్ స్పాండెలోసిస్, డిస్క్ సమస్యలతో బాధ పడుతున్న వారికి ఎక్సరేలు తీసి, తగిన సలహాలు, సూచనలు చేశారు. ఫిజిథెరపీ అవసరమైన వారికి ఫిజియోథెరపీ కూడా చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మీసాల సంతోష్, పొన్నాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణానికి పందిరిరాట



పందిరిరాట వేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో ఉన్న శ్రీ సోమలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణానికి ఆదివారం పందిరిరాట వేశారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని, ఆలయ ప్రాంగణంలో జరిగే శివపార్వతుల కల్యాణానికి సంబంధించి, కార్యక్రమానికి హాజరైన మహిళలు పసుపు దంచి, సిద్ధం చేశారు. కార్యక్రమంలో అర్చకులు కామేశ్వరశర్మ, పూతిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



యోగాసనాలు వేస్తున్న శిక్షణార్థులు

విజయనగరం: నగరంలోని సంతపేట గవర వీధి జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో ఉచిత యోగా శిక్షణా తరగతులు ఆదివారం ప్రారంభించారు. శ్రీగౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ తరగతులకు హాజరైన వారికి యోగా ఇంటర్నేషనల్ ట్రైనర్ జ్వాల వివిధ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. సంఘ అధ్యక్షుడు కాంద్రేగుల శేఖర్ మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడి దూరమై, ప్రశాంతత చేకూరుతుందన్నారు. అందం, ఆరోగ్యం కూడా పెరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గంగాధర్, నాగభూషణరావు, కాశీ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

16వ తేదీన బంగారమ్మ తీర్థం

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామదేవత బంగారమ్మ తల్లి తీర్థం ఈ నెల16వ తేదీన నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆరోజు సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గుర్రాల పరుగు పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. గుర్రాల పరుగు పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు

బాల్యవివాహాలు అరికట్టాల్సిన బాధ్యత అందరిదీ..



అవగాహన కల్పిస్తున్న ఎస్బీసీసీ జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ

బొండపల్లి: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ(ఎస్బీసీసీ)జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. మండలంలోని దేవుపల్లి గ్రామంలో కస్తూర్బా గాంధీ విద్యాలయం(కేజీబీవీ)లో విద్యార్థినులకు పౌష్టికాహారం ఆవశ్యకత, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, లింగ వివక్షతపై ఆదివారం అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేసుకోవాలని బాలికలకు సూచించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, రక్త హీనత సమస్య రాకుండా ఉండేందుకు కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. సామాజిక అసమానతలు తొలగించడానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. కేజీబీవీ ఎస్ఓ ఎం.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



రక్తదానం చేస్తున్న యువత, వెనక నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: రక్తదాతలే ప్రాణదాతలని, విద్యార్థులు, యువతీ యువకులు రక్తదానానికి ముందుకు వచ్చి, ప్రాణదాతలుగా నిలవాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని దాసన్నపేట సింగపూర్ సిటీ ఆవరణలో రోటరీ క్లబ్, రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ హితం కోసం రోటరీ క్లబ్ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ చేసే ప్రతి ప్రజాహిత కార్యక్రమానికి తమవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. జిల్లాలో రక్తం కొరత లేకుండా, రక్త నిల్వలు పెంచేందుకు అన్ని రక్త నిధి కేంద్రాలను సమన్వయపరిచి డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి ఎంతోమందికి రక్తం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో యువత, విద్యార్థులు ముందుకు వచ్చి, రక్తదానం చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలని, రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యమే తప్ప శరీరానికి నష్టమేమీ ఉండదన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారిని ఆమె అభినందించి, ప్రోత్సహించారు. నిర్వాహకులు కూడా ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్, రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కొత్తగా ఎన్నికైన సోషల్ మీడియా మండల కన్వీనర్, కో-కన్వీనర్లను సన్మానిస్తున్న పార్టీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి సూచించారు. మండలంలోని ఉప్పాడపేటలో ఉన్న పార్టీ కార్యాలయంలో కొత్తగా నియమితులైన పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ శీరపు వంశీరెడ్డి, కో-కన్వీనర్లు సూరిబాబు, బంగారుబాబు, లక్ష్మణ్, సూర్యనారాయణలను ఆదివారం సన్మానించి, అభినందనలు తెలియజేశారు. పార్టీ ఎంతో నమ్మి ఈ బాధ్యత అప్పగించిందని, మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పాడ శివారెడ్డి, సర్పంచ్‌లు ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి, బైరెడ్డి రమణ, ఎంపీటీసీ సభ్యుడు పట్నా తాతయ్యలు, సచివాలయ కన్వీనర్ శ్రీరపు గురునాథ్ రెడ్డి, సోషల్ మీడియా కో-కన్వీనర్ బాకి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో ఈ నెల 14వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. స్వామి కంటి ఆస్పత్రి సౌజన్యంతో అసిరి తల్లి గుడి వద్ద ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రమైన రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకం లేకుండా దేవస్థానం అధికారులు చర్యలు చేపడుతున్నారు. కొత్తపేట, సీతారామునిపేట, గొర్లిపేట గ్రామాల్లో ఆదివారం విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకే చెట్ల కొమ్మలు, జంగిల్స్‌ను తొలగించారు. శివరాత్రికి భక్తుల రద్దీ దృష్ట్యా తోపులాటలు జరగకుండా ఇనుప బారికేడ్లను సిద్ధం చేస్తున్నారు. రామాలయంలో దర్శన, ప్రసాదాల కౌంటర్లతో పాటు ఉమా సదాశివాలయ ప్రాంగణంలోను బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారునికి సత్కారం



శ్రీనును సత్కరిస్తున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

నెల్లిమర్ల: పట్టణానికి చెందిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మీసాల శ్రీనును నెల్లిమర్ల బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆదివారం ఘనంగా సత్కరించింది. ఈ నెల 3, 4వ తేదీల్లో కడపలో జరిగిన ఏపీ మాస్టర్స్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీను రన్నరప్‌గా నిలిచారు. 40 ప్లస్ సింగిల్స్ విభాగంలో ఈ ఘనతను ఆయన సాధించారు. వచ్చే నెల గోవాలో జరగన్ను జాతీయ స్థాయి పోటీలకు కూడా ఆయన ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనును దుశ్శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు. అనంతరం శ్రీను మాట్లాడుతూ అసోసియేషన్ సహకారంతోనే రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలవగలిగానన్నారు. పట్టణానికి ఇండోర్ స్టేడియం మంజూరు చేసినట్లయితే మరింత మంది బ్యాడ్మింటన్ క్రీడలో రాణించగలరన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పైడిరాజు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

గుర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16వ తేదీన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్యాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు , పీఏసీఎస్‌ల చైర్మన్‌లు హాజరుకావాలని కోరారు.

'స్నేహ' టాలెంట్‌టెస్ట్



టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ నేతృత్వంలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. 50 మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు స్నేహ వార్షికోత్సవం రోజున బహుమతులు ప్రధానం చేస్తామని టాలెంట్ టెస్ట్ నిర్వాహకుడు పి.శ్రీరాములు తెలిపారు.

పుణ్యగిరిని సందర్శించిన అధికారులు

- శివరాత్రి జాతరపై స్థానిక అధికారులకు సూచనలు



అధికారులతో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో విశిష్ట శైవక్షేత్రంగా వాసికెక్కిన పుణ్యగిరిలో శివరాత్రి సందర్భంగా రెండురోజులు నిర్వహించనున్న జాతర ఏర్పాట్లను ఆర్డీఓ సూర్యకళ, తమ రెవెన్యూ అధికారులతో, ఎస్‌డీపీఓ ఆర్.శ్రీనివాసరావు తమ పోలీస్ అధికారులతో కలిసి ఆదివారం పర్యవేక్షించారు. ఆర్డీఓ సూర్యకళ దారగంగమ్మలోయ, కోటిలింగాలరేవు, త్రినాథగుహ, పుట్టుదార ప్రాంతాలను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో ఏటా భక్తులకు ఎదురయ్యే ఇబ్బందులు, పరిస్థితులను తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఎస్‌డీపీఓ శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లపై ఎస్.కోట సీఐ సింహాద్రినాయుడు, ఎస్‌ఐ తారకేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌శాఖ పరంగా ఎక్కడా ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కేంద్రం నుంచి తగిన బలగాలు సాయం అందేలా చూస్తామని ఎస్‌డీపీఓ చెప్పారు.

'కళాతపస్వి'కి ఘననివాళులు



విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక గాయత్రి భవన్‌లో బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో కళాతపస్వి కె.విశ్వనాథ్ సంస్మరణ సభ ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సమాఖ్య సభ్యులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం విశ్వనాథ్ జీవితంలోని ముఖ్య సంఘటనలు గుర్తు చేసి, ఆయన సేవలను సమాఖ్య గౌరవాధ్యక్షుడు శ్రీకాంత్ కొనియాడారు. విశ్వనాథ్ చలనచిత్ర వైభవాన్ని అధ్యక్షుడు భోగరాజు బాబూజీ ప్రశంసించారు. మరో వక్త పీవీఎల్ సుబ్బారావు కవితాత్మకంగా ఆయనతో వారికి ఉన్న అనుబంధాన్ని తెలిపారు. కార్యక్రమంలో భరద్వాజ చక్రవర్తి, కామేశ్వరరావు, దామరాజు శంకరం, రమాదేవి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రమోహన్



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రమోహన్

నెల్లిమర్ల: క్రీడలతో ఉజ్వల భవిషత్ ఉంటుందని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రమోహన్ అన్నారు. మండల కేంద్రంలో 'మోదీ కబడ్డీ కప్' టోర్నమెంట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన రిబ్బన్ కట్ చేసి, పోటీలను ఆరంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం లభిస్తుందన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఇప్పుడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కాళ్ల నారాయణరావు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని, ఉపాధ్యక్షుడు బూర్లె శ్రీధర్, పిళ్లా నవీన్, మన్యపురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు సందేశంతో ప్రపంచ శాంతి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పాస్టర్ రవికుమార్, తదితరులు

విజయనగరం టౌన్: ఏసుక్రీస్తు బోధనలు, సందేశం ప్రపంచ శాంతికి దోహదపడతాయని యేసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అంబటిసత్రం దగ్గరున్న చర్చి ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన స్థానిక గురజాడ కళాభారతి ఆవరణలో యూత్ ఫర్ జీసెస్ ఆధ్వర్యంలో ప్రియమైన నీకు విత్ లవ్ జీసెస్ అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నానని ప్రభువైన ఏసుక్రీస్తు అందరికీ చెప్పియున్నారని, ఆ ప్రేమను పొందేందుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు. క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతి, సామరస్యం కోరుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా టీమ్, సెరూయా టీమ్, జోసెఫ్ టీమ్, జీసస్ ట్రాంపెట్స్ పాల్గొంటాయన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించి, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిస్టర్ సువర్ణ, విక్టర్ బాబు, సీతారామయ్య, దేవరాజు, జాన్, నాగేశ్వరరావు, సుజాన్, యూత్ ఫర్ జీసెస్ టీమ్ హర్ష, నిశాంత్, ప్రశాంత్, డేవిడ్, మోడీ, లిక్కీ మోడీ అండ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కమిటీలో మీడియా సభ్యులు



పీఎస్ఎస్‌వీ శివప్రసాద్, దూరదర్శిని కరస్పాండెంట్



కె.శేషగిరి, కేబుల్ నెట్ వర్క్ మైత్రి మీడియా బ్యూరో చీఫ్

విజయనగరం అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మీడియాలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి, పర్యవేక్షణ నిమిత్తం జిల్లా స్థాయి మీడియా ధ్రువీకరణ, పర్యవేక్షణ కమిటీలో మీడియా తరఫున దూరదర్శన్ కరస్పాండెంట్ పీఎస్ఎస్‌వీ శివప్రసాద్, కేబుల్ నెట్‌వర్క్ తరఫున మైత్రి మీడియా బ్యూరో చీఫ్ జె.శేషగిరి సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, సభ్యులుగా జేసీ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి.రమేష్ కొనసాగుతారు. ఎన్నికల దృష్ట్యా ప్రచార, ప్రసార మాధ్యమాల్లో ముఖ్యంగా అన్ని టీవీ చానళ్లు, దిన, వార, పక్ష, మాసపత్రికలు, ఆకాశవాణి, ఎఫ్ఎంలలో అభ్యర్థులు, పార్టీ నిర్వహించే ప్రచార కార్యక్రమాలపై కమిటీ సభ్యులు దృష్టి సారిస్తారు. ఎప్పటికప్పుడు ఖర్చులను పరిశీలిస్తారు.

డీఈసీ, అల్బెండ్‌జోల్ మాత్రల పంపిణీ



బొండపల్లి: నెలివాడలో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గత రెండు రోజుల్లో 26 వేల మందికి ఫైలేరియా, నులిపురుగుల నివారణకు డీఈసీ, అల్బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేశామని వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ తెలిపారు. నెలివాడ గ్రామంలో ప్రజలకు డీఈసీ, అల్బెండ్‌జోల్ మాత్రలను వైద్యసిబ్బంది ఆదివారం పంపిణీ చేశారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మాత్రలు అందించి, వాటిని వారితో మింగించారు. సీహెచ్ఓ రాజ్‌గోపాల్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: గడసాంలో డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

గడసాంలో..

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామంలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు ఫైలేరియా నివారణకు డీఈసీ మాత్రలను వైద్యసిబ్బంది ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నివాస పరిసరాల్లో చెత్త, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

సీఎం జగన్ పాలనలో

అణగారిన కులాలకు రాజ్యాధికారం

- రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు, తదితరులు

వీరఘట్టం: అణగారిన కులాలకు రాజ్యాధికారం ఇస్తే ఆ కులాలు అభివృద్ధి చెందుతాయని చెప్పిన భారత రాజ్యాంగ నిర్మాణకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు అన్నారు. ఆదివారం వీరఘట్టంలో ఏర్పాటు చేసిన కళింగ వైశ్య సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 56 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజ్యాధికారం ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 4.50 లక్షల జనాభా ఉన్న కళింగ వైశ్యుల అభివృద్ధికి గతంలో ఏ ప్రభుత్వం చొరవ చూపలేదన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి పాలనలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వీరఘట్టంలో కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. సామాజికంగా వెనుకబడిన వారిని గుర్తించి ఆదుకోవాలని సంఘ సభ్యులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని కోరారు. కళింగ వైశ్య సంఘం కల్యాణ మండపం కోసం కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అందవరపు కోటీశ్వరరావు, జిల్లా కార్యదర్శి సంకా గౌరీశంకరరావు, స్టేట్ డైరెక్టర్ లాడి మెహర్‌ప్రసాద్, సభ్యులు కెంగువ అంజనేయులు, భోగి మణి, తూముల రమేష్, కోణార్క్ శ్రీను, వారణాసి కృష్ణమూర్తి, చిన్నారి తవిటిరాజు, దేవరశెట్టి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కళింగ వైశ్యులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

కొమరాడ: రాష్ట్రంలో సుమారు 4.5 లక్షల మంది ఉన్న కళింగ వైశ్యులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కళింగ వైశ్య పెద్దలు కోరారు. మండలంలోని తులసివలస గ్రామంలో మండల కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర కోశాధికారి దేవరశెట్టి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, కురుపాం మాజీ జెడ్పీటీసీ, మన్యం జిల్లా కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు కోటీశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో కళింగ వైశ్యుల అభివృద్ధికి చేయూత అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జగనన్నను మనమంతా కలిసి మరోసారి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొమరాడ కళింగ వైశ్య కులపెద్దలు బుడుమూరి శ్రీనివాసరావు, వడ్డీ గాంధీలను సన్మానించారు.